మహా సీఎంపై వీడని సస్పెన్స్!

- మహాయుతిలో మల్లగుల్లాలు
- ఏక్‌నాథ్ షిండేకు ముఖ్యమంత్రి పదవికి శివసేన పట్టు
- ఫడ్నవీస్‌కు అజిత్ పవార్ మద్దతు

ముంబై, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి నూతన ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరుగుతున్నది. బీజేపీ, శివసేన, ఎన్సీపీ నేతలు ముఖ్యమంత్రి పదవిపై ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఏక్‌నాథ్ షిండేను ముఖ్యమంత్రిగా కొనసాగించాలని శివసేన గట్టిగా పట్టుబడుతున్నది. శివసేన అధికార ప్రతినిధి నరేశ్ మహస్కే బీహార్ మోడల్‌ను గుర్తు చేస్తున్నారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూకు తక్కువ సీట్లు వచ్చినా, ఆయననే ముఖ్యమంత్రిగా కొనసాగించారని చెప్తున్నారు. బీజేపీ ఎమ్మెల్సీ ప్రవీణ్ దరేకర్ మాత్రం సీఎంగా దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఎంపిక చేయాలని కోరుతున్నారు. రాష్ట్రాన్ని నడపటానికి ఆయనే అత్యంత సమర్థుడని వాదిస్తున్నారు. ఈ నెల 20న జరిగిన ఎన్నికల్లో బీజేపీకి 132, శివసేనకు 57, ఎన్సీపీకి 41 స్థానాలు లభించాయి.మహారాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సోమవారం ఉంటుందని మొదట్లో ప్రచారం జరిగింది. కానీ మహాయుతి నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అది సాధ్యం కాలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు వార్తలు రాగానే, శివసేన నేతలు ఘాటుగా స్పందించారు. సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోనే ఎన్నికల్లో పోటీ చేసినందువల్ల ఆయననే ముఖ్యమంత్రిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలావుండగా, లోక్ సభ సభాపతి ఓం బిర్లా కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు ఫడ్నవీస్, షిండే, అజిత్ పవార్ సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో వీరు ముగ్గురూ బీజేపీ నేతలతో సమావేశమై ప్రతిష్టంభనకు తెరదించుతారని తెలుస్తున్నది.

ఫడ్నవీసే సీఎం: రామ్‌దాస్ అథవాలే

కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే సోమవారం మాట్లాడుతూ, మహారాష్ట్ర సీఎంగా దేవేంద్ర ఫడ్నవీస్ తగినవారని చెప్పారు. ఆయనకు ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ మద్దతిచ్చారన్నారు. రెండు, మూడు రోజుల్లో దీనిపై నిర్ణయం వెలువడుతుందన్నారు.

చెరొక రెండున్నరేళ్లు?

మరో సమాచారం ప్రకారం, మొదటి రెండున్నరేళ్లు ఫడ్నవీస్, మిగిలిన రెండున్నరేళ్లు షిండే సీఎం పదవిని నిర్వహించేందుకు అంగీకారం కుదిరినట్లు తెలుస్తున్నది. రెండున్నరేళ్ల తర్వాత ఫడ్నవీస్‌ను బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమిస్తారని ప్రచారం జరుగుతున్నది.

అండమాన్‌లో 6 టన్నుల డ్రగ్స్ పట్టివేత

కోస్ట్‌గార్డ్ చరిత్రలో ఇదే అత్యధికం • ఆరుగురు మయన్మార్ జాతీయుల అరెస్ట్

న్యూఢిల్లీ: అండమాన్ తీరంలో ఏకంగా 6 టన్నుల మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. ఓ చేపల పడవలో తరలిస్తుండగా ఇండియన్ కోస్ట్‌గార్డ్ దీనిని స్వాధీనం చేసుకుని, ఆరుగురు మయన్మార్ జాతీయులను అరెస్ట్ చేసింది. ఐసీజీకి చెందిన డోర్నియర్ విమానం పైలట్ ఈ నెల 23న బారెన్ ద్వీపంలో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న పడవను గుర్తించారు. దీంతో ఐసీజీ గగనతల, సముద్ర మార్గాల్లో సమన్వయంతో పని చేసి, ఈ నెల 24న ఈ పడవను పట్టుకున్నారు. భారతీయ జలాల్లో ఇంత పెద్ద ఎత్తున మాదక ద్రవ్యాలు పట్టుబడటం ఇదే మొదటిసారి అని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. ఈ డ్రగ్స్ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కోట్లాది రూపాయలు ఉంటుందని చెప్పారు. అండమాన్, నికోబార్ పోలీసులతో కలిసి దర్యాప్తు కొనసాగించనున్నట్లు వివరించారు.

అమెరికా కొలువు కష్టమే

- హెచ్1బీ స్పాన్సర్‌షిప్‌లకు కోత
- భారీగా తగ్గించిన టెక్ కంపెనీలు
- ఏఐ, మాంద్యమే ప్రధాన కారణాలు
- భారతీయులపైనే ఎక్కువ ప్రభావం
- వీసాల కోసం పెరగనున్న పోటీ

న్యూఢిల్లీ, నవంబర్ 25: మంచి జీతం, మెరుగైన జీవితాన్ని అందించే అమెరికా ఉద్యోగం కోసం విదేశీయులు పెట్టుకునే ఆశలను అక్కడి టెక్ కంపెనీలు అడియాశలు చేస్తున్నాయి. హెచ్1బీ వీసా స్పాన్సర్‌షిప్‌లను భారీగా తగ్గిస్తున్నాయి. విదేశీ గ్రాడ్యుయేట్లు, నిపుణులకు తమ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు అమెరికా సంస్థలు హెచ్1బీ వీసాలను స్పాన్సర్ చేస్తాయి. ఈ వీసాలు ఉంటే ఆరేండ్ల పాటు అమెరికాలో స్పాన్సర్ చేసిన కంపెనీలో పని చేసే వీలుంటుంది. అయితే, 2023తో పోల్చితే 2024లో హెచ్1బీ వీసా స్పాన్సర్‌షిప్‌లను పెద్ద టెక్ కంపెనీలు భారీగా తగ్గించేశాయి. ఎక్కువ హెచ్1బీ వీసాలు స్పాన్సర్‌షిప్ చేసే మొదటి 15 కంపెనీల్లో దాదాపుగా అన్ని కంపెనీలూ 2024లో స్పాన్సర్‌షిప్‌లను తగ్గించాయని యూనైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) డాటా ద్వారా వెల్లడైంది.

పెద్ద కంపెనీలన్నీ ఇదే దారిలో..

అమెజాన్, గూగుల్, ఇన్ఫోసిస్, ఐబీఎం వంటి అన్ని పెద్ద స్థాయి టెక్ కంపెనీలు ఈ ఏడాది హెచ్1బీ స్పాన్సర్‌షిప్‌లకు కోత పెట్టాయి. 2023లో 11 వేల వీసాలు స్పాన్సర్ చేసిన అమెజాన్ ఈ ఏడాది ఏడు వేలు మాత్రమే చేసింది. భారతీయ సంస్థలైన ఇన్ఫోసిస్, టీసీఎస్‌తో పాటు గూగుల్, మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, డెలాయిట్ సంస్థలు కూడా స్పాన్సర్‌షిప్‌లను తగ్గించాయి. మెటా సంస్థ మాత్రమే గత ఏడాది కంటే స్వల్పంగా, 400 స్పాన్సర్‌షిప్‌లను పెంచింది.

భారతీయులకే పెద్ద దెబ్బ

హెచ్1బీ వీసాల స్పాన్సర్‌షిప్‌లు తగ్గిపోవడం భారతీయులపైనే ఎక్కువగా ప్రభావం చూపిస్తుంది. ఈ వీసాలు పొందే వారిలో భారతీయులే అత్యధికం. 2023లో జారీ అయిన మొత్తం హెచ్1బీ వీసాల్లో మనోళ్లకే 72.3 శాతం దక్కడం బట్టి ఈ విషయం స్పష్టమవుతున్నది. చైనీయులకు 11.7 శాతం దక్కాయి. స్పాన్సర్‌షిప్‌లు తగ్గడం వల్ల హెచ్1బీ కోసం పోటీ భారీగా పెరిగిపోనుంది. కాగా, కృత్రిమ మేధ(ఏఐ) ప్రభావం పెరగడం, మాంద్యం వల్ల ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా టెక్ కంపెనీలు స్పాన్సర్‌షిప్‌లను తగ్గించాయని ఇమిగ్రేషన్ నిపుణుడు అజయ్ శర్మ అభిప్రాయపడ్డారు.

తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించిన గవర్నర్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన విగ్రహాన్ని తానే రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఆయన గవర్నర్‌గా ప్రమాణం చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పార్థ సాహా అనే కళాకారుడు ఈ విగ్రహాన్ని బహుమతిగా ఇచ్చినట్లు సమాచారం. టీఎంసీ నేత జయప్రకాశ్ మజుందార్ స్పందిస్తూ, పబ్లిసిటీ కోసమే గవర్నర్ తన విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నారన్నారు. అయితే ఆయన తదుపరి చర్య ఏమిటి? తన విగ్రహానికి తానే పూలమాల వేసుకుంటారా? అని ప్రశ్నించారు. సీపీఎం సెంట్రల్ కమిటీ సభ్యుడు సుజన్ మాట్లాడుతూ, ఇది అత్యంత అమర్యాదకరమని మండిపడ్డారు. ఇది రాష్ట్రానికి దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సౌమ్య మాట్లాడుతూ, గవర్నర్ తీరు సిగ్గుచేటు అన్నారు. బెంగాల్ సంస్కృతితో ఆటలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

పాన్ కార్డులకు క్యూఆర్ కోడ్

- పాన్ 2.0 ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- ఉచితంగా అప్‌గ్రేడ్ చేసుకునేందుకు అవకాశం

న్యూఢిల్లీ, నవంబర్ 25: పాన్ కార్డులను పూర్తిగా డిజిటలీకరణ చేయాలని, ప్రతి పాన్ కార్డుకు క్యూఆర్ కోడ్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రూ.1,435 కోట్లతో చేపట్టనున్న పాన్ 2.0 ప్రాజెక్టుకు సోమవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ(సీసీఈఏ) సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాన్ కార్డులను ఉచితంగా అప్‌గ్రేడ్ చేసి, క్యూఆర్ కోడ్ ఇవ్వనున్నట్టు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. చాలాకాలంగా వాణిజ్యవర్గాలు కోరుతున్నట్టుగా పాన్, టాన్ సేవలను కలిపేయనున్నట్టు, పూర్తిగా పేపర్‌లెస్, ఆన్‌లైన్ పద్ధతిలో కొత్త పోర్టల్ ప్రారంభించనున్నట్టు చెప్పారు.

సేంద్రీయ వ్యవసాయానికి 2,481 కోట్లు

దేశంలో వినూత్న ఆవిష్కరణలు, ఔత్సాహిక వ్యవస్థాపకులకు అనుకూలమైన వ్యవస్థ ఏర్పాటు కోసం అటల్ ఇన్నొవేషన్ మిషన్(ఏఐఎం 2.0) కార్యక్రమానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2028 మార్చి 31 వరకు రూ.2,750 కోట్లతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నది. దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను సేంద్రీయ వ్యవసాయం దిశగా ప్రోత్సహించేందుకు రూ.2,481 కోట్లు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. పరిశోధనలను ప్రోత్సహించేందుకు గానూ రూ.6,000 కోట్లతో 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' పథకానికి ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా పరిశోధకులకు ఒకే వేదికపై దేశంలోని అన్ని పరిశోధన పత్రాలు, జర్నళ్లు చదివేందుకు వీలు కలగనుంది. అరుణాచల్ ప్రదేశ్‌లో రూ.3,689 కోట్లతో చేపట్టనున్న రెండు జల విద్యుదుత్పత్తి కేంద్రాలకూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రాజ్యాంగ ప్రవేశికనూ పార్లమెంట్ సవరించొచ్చు

లౌకిక, సామ్యవాద పదాలపై దాఖలైన పిటిషన్ల కొట్టివేత

న్యూఢిల్లీ: రాజ్యాంగ ప్రవేశికలో సామ్యవాద, లౌకిక, సమగ్రత పదాలను చేర్చడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం డిస్మిస్ చేసింది. 1976లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ పదాలను 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చింది. మాజీ రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్య స్వామి, అడ్వకేట్ అశ్విని ఉపాధ్యాయ్, బలరామ్ సింగ్ ఈ పిటిషన్లను దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం ఈ నెల 22న తీర్పును రిజర్వు చేసింది. సోమవారం తీర్పు చెప్తూ, ఈ రిట్ పిటిషన్లపై తదుపరి విచారణ అవసరం లేదని తెలిపింది. పార్లమెంటుకు రాజ్యాంగానికి సవరణ చేసే అధికారం ఉందని, ఆ అధికారం రాజ్యాంగ ప్రవేశికకు కూడా వర్తిస్తుందని వివరించింది. దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) అమలులో ఉన్న కాలంలో పార్లమెంటు ఏం చేసినా చెల్లదనడం సరికాదని స్పష్టం చేసింది.

'అదానీ'పై అట్టుడికిన పార్లమెంట్

- అవినీతి ఆరోపణలపై చర్చించాలని ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యుల పట్టు
- ఇరుసభలు బుధవారానికి వాయిదా
- అదానీపై చర్చకు ఎందుకంత భయం: ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, నవంబర్ 25: పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రతిపక్ష పార్టీల ఎంపీల ఆందోళనతో ఉభయ సభలు ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాయిదా పడ్డాయి. ఇటీవల మృతి చెందిన లోక్‌సభ సభ్యులు వసంత్ చవాన్(నాందేడ్), ఎస్‌కే నురుల్ ఇస్లాం(బసిర్హాట్)తో పాటు మాజీ సభ్యులకు లోక్‌సభ సంతాపం తెలిపింది. అనంతరం భారత్‌లో అధికారులకు లంచాలు ఇచ్చారనే ఆరోపణలపై వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన కేసుపై చర్చించాలని కోరుతూ ప్రతిపక్షాల ఎంపీలు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ స్థానంలో ఉన్న ఎంపీ సంధ్య రే తిరస్కరించారు. దీంతో అదానీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. అదానీపై వచ్చిన ఆరోపణలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గందరగోళం నెలకొనడంతో సభ బుధవారానికి వాయిదా పడింది. అదానీపై చర్చ జరపడానికి ప్రభుత్వం భయపడుతున్నదని, ప్రతిపక్షం నుంచి ఒక్క మాట కూడా వినేందుకు సిద్ధంగా లేదని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ విమర్శించారు.

రాజ్యసభలోనూ సేమ్ సీన్

రాజ్యసభలోనూ అదానీ అంశం, మణిపూర్, యూపీ హింసపై చర్చించాలని కోరుతూ వచ్చిన 13 నోటీసులను చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్, వామపక్ష సభ్యులు సభను అడ్డుకున్నారు. అదానీపై అమెరికాలో కేసు వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని, అదానీకి ప్రధాని మోదీ మద్దతు ఇస్తున్నారని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపణలతో సభలో గందరగోళం నెలకొన్నది. దీంతో సభను 15 నిమిషాల పాటు చైర్మన్ వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించడంతో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కాగా, సభను వాయిదా వేయడం ద్వారా అదానీ అంశంపై చర్చ జరగడం ప్రభుత్వానికి ఇష్టం లేదని స్పష్టమవుతున్నదని రాజ్యసభ ప్రతిపక్ష ఉపనాయకుడు ప్రమోద్ తివారి పేర్కొన్నారు. అదానీపై ఆరోపణలు వస్తే, బీజేపీకి నొప్పి కలుగుతున్నదని ఎద్దేవా చేశారు.

నేడు పార్లమెంటులో సంవిధాన్ దివస్ వేడుకలు

భారత రాజ్యాంగాన్ని అమలు చేసి 75 ఏండ్లు అవుతున్న నేపథ్యంలో ఏడాది పాటు జరగనున్న సంబరాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. సంవిధాన్ దివస్ సందర్భంగా పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉభయసభల ఉమ్మడి సమావేశం జరగనున్నది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సమావేశంలో ప్రసంగించనున్నారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సైతం ప్రసంగిస్తారని కేంద్రమంత్రి కిరణ్ రిజుజు తెలిపారు. అయితే, ఉభయ సభల ప్రతిపక్ష నేతలు సైతం ప్రసంగించేందుకు అవకాశం ఇవ్వాలని ఇండియా కూటమి సభ్యులు స్పీకర్ ఓం బిర్లాను కలిసి కోరారు.

మహిళలకు ఇల్లు నరకప్రాయం!

- భాగస్వామి, కుటుంబసభ్యుల దాష్టీకానికి రోజుకు 140 మంది మహిళల మృతి: ఐరాస

ఐక్యరాజ్యసమితి: మహిళలు, బాలికలకు ప్రాణాంతక, భయానక ప్రదేశం ఇల్లేనని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. 2023లో రోజుకు 140 మంది మహిళలు, బాలికలు తమ జీవిత భాగస్వామి, కుటుంబసభ్యుల చేతుల్లో హత్యకు గురయ్యారని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి మరణాల సంఖ్య సుమారు 51,100 అని వివరించాయి. 2022లో 48,800 మంది ఈ విధంగా మరణించినట్లు అంచనా. ఈ నివేదికలను యునైటెడ్ నేషన్స్ విమెన్, యూఎన్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్ అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినం సందర్భంగా సోమవారం విడుదల చేశాయి. మహిళలు, బాలికలకు ప్రమాదకరమైన ప్రదేశం ఇల్లేనని వివరించాయి. ప్రతి లక్ష మంది జనాభాకు 2.9 మంది మహిళలు ఆఫ్రికా దేశాల్లోనూ, 1.6 మంది మహిళలు అమెరికాస్‌లోనూ ఈ విధంగా మరణించినట్లు తెలిపాయి. ఈ రేటు ఆసియా (0.8), యూరప్ (0.6)లో తక్కువ.

అదానీకి మరో ఎదురుదెబ్బ

- కొలంబో పోర్టులో టెర్మినల్ నిర్మాణానికి ఆగిపోయిన రుణం
- యూఎస్ ఐడీఎఫ్‌సీ నిర్ణయం
- నిలిచిపోయిన రూ.4,661 కోట్లు

న్యూయార్క్, నవంబర్ 25: అదానీ సంస్థకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అదానీ సంస్థ భాగస్వామిగా ఉన్న కొలంబో పోర్టు టెర్మినల్ ప్రాజెక్టు నిర్మాణానికి యూఎస్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్(డీఎఫ్‌సీ) నుంచి రావాల్సిన రుణం ఆగిపోయింది. శ్రీలంక రాజధానిలో చేపడుతున్న ఈ ప్రాజెక్టు కోసం రూ.4,661 కోట్ల రుణాన్ని మంజూరు చేసేందుకు గత నవంబర్‌లో అమెరికా ప్రభుత్వ సంస్థ అయిన డీఎఫ్‌సీ అంగీకరించింది. అయితే, భారత ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇచ్చారని గౌతమ్ ఆదానీ సహా అదానీ గ్రూప్ ముఖ్యులపై అమెరికా న్యాయశాఖ ఆరోపణల నేపథ్యంలో ఈ రుణం ఆగిపోయింది. ఇప్పటివరకు ఈ రుణం కింద నిధులు విడుదల చేయని డీఎఫ్‌సీ.. ఇప్పుడు తన నిర్ణయాన్ని సమీక్షించుకుంటున్నది. అదానీపై అమెరికా న్యాయశాఖ చేసిన ఆరోపణలపై అవగాహన ఉందని, ఈ అంశాన్ని సమీక్షిస్తున్నామని డీఎఫ్‌సీ ఒక ప్రకటనలో పేర్కొన్నది. పోర్టు టెర్మినల్ నిర్మాణానికి రుణం ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదని తెలిపింది. 'మా ప్రాజెక్టులు, భాగస్వాములు అత్యున్నత నిబద్ధత, సమగ్రతా ప్రమాణాలను పాటించేందుకు మేం కట్టుబడి ఉన్నాం' అని డీఎఫ్‌సీ పేర్కొన్నది.

ఫిబ్రవరి 18 నుంచి ఐసీఎస్ఈ పరీక్షలు

అదే నెల 13 నుంచి ఐఎస్ఈ పరీక్షలు

న్యూఢిల్లీ: ఐసీఎస్ఈ(10వ తరగతి), ఐఎస్‌సీ(12వ తరగతి) పరీక్షల డేట్‌షీట్లను కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్(సీఐఎస్‌సీఈ) సోమవారం విడుదల చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 18 నుంచి మార్చి 27 వరకు ఐసీఎస్ఈ పదో తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపింది. భారత్‌తో పాటు థాయ్‌లాండ్, సింగపూర్, ఇండోనేషియా, యూఏఈలో 2,803 పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించింది. ఐఎస్‌సీ 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 13 నుంచి ఏప్రిల్ 5 వరకు జరుగుతాయని తెలిపింది. భారత్‌తో పాటు యూఏఈ, సింగపూర్‌లో 1,461 పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించింది.

ఊబకాయంతో మధుమేహం!

- రెండింటి మధ్య సంబంధాన్ని గుర్తించిన అమెరికా శాస్త్రవేత్తలు
- మధుమేహ చికిత్సకు కొత్త మార్గం

న్యూయార్క్, నవంబర్ 25: ఊబకాయం వల్ల మధుమేహం ముప్పు పెరుగుతుందనే విషయాన్ని అనేక అధ్యయనాలు ఇప్పటికే తేల్చి చెప్పాయి. అయితే, ఈ రెండింటికి మధ్య ఉన్న సంబంధంపై అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు కొత్త విషయాన్ని గుర్తించారు. చిన్న, ఆరోగ్యకరమైన కణాలుగా ఉత్పత్తి చేసేలా కొవ్వు మూలకణాలను ప్రోత్సహించడం ద్వారా మధుమేహానికి చికిత్స అందించే అవకాశం ఉందని తేల్చారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా – లాస్ ఏంజెల్స్(యూసీఎల్ఏ)కు చెందిన శాస్త్రవేత్తల బృందం చేసిన ఈ అధ్యయన వివరాలు 'సెల్ రిపోర్ట్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం.. ఊబకాయం వల్ల రైబోసోమల్ ఫ్యాక్టర్స్ అనే కీలకమైన సెల్యూలర్ బిల్డింగ్ బ్లాక్స్‌ను శరీరం సరిగ్గా ఉత్పత్తి చేయలేకపోతున్నట్టు గుర్తించారు. సరిపడా రైబోసోమల్ ఫ్యాక్టర్స్ లేకపోతే కొవ్వు మూలకణాలు.. పని చేసే కొవ్వు కణాలను ఉత్పత్తి చేయలేవు. ఇది క్రమంగా మధుమేహానికి దారి తీస్తున్నట్టు తేల్చారు. కొవ్వు కణజాలం సరిగ్గా పని చేయనప్పుడు ఆహారం నుంచి వచ్చే శక్తి.. కాలేయం, గుండె వంటి ఇతర అవయవాలకు వెళ్తుంది. దీంతో ఫ్యాటీ లివర్, గుండెజబ్బుల ముప్పు సైతం పెరుగుతుంది. కాబట్టి, కొవ్వు మూలకణాలు.. చిన్న, ఆరోగ్యకరమైన కణాలుగా ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించడం ద్వారా మధుమేహంతో పాటు ఫ్యాటీ లివర్ వంటి జబ్బుల ముప్పును తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మధుమేహ, ఊబకాయం ఉన్న ఎలుకలకు రోసిగ్లిటాజోన్ అనే ఔషధాన్ని ఇచ్చి చేసిన ప్రయోగం సఫలమైనట్టు చెప్పారు.

భూభ్రమణ అక్షంలో మార్పు

భూగర్భ జలాలను భారీగా తోడేయడమే కారణం

న్యూఢిల్లీ: వాతావరణ మార్పుల వల్ల భూగోళంపై పడుతున్న ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్న పరిశోధకులు దిగ్భ్రాంతికరమైన ఓ విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. భూగర్భ జలాలను మానవాళి అమితంగా తోడేయడం వల్ల భూభ్రమణ అక్షం 31.5 అంగుళాల (దాదాపు 80 సెంటీమీటర్లు) మేరకు వంగిపోయిందని, ఇది భూభ్రమణంలో మార్పునకు, సముద్ర మట్టాల పెరుగుదలకు దారితీసిందని వెల్లడించారు. ఈ అధ్యయన వివరాలు జర్నల్ జియోఫిజికల్ రిసెర్చ్ లెటర్స్‌లో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం భూగోళ అక్షంలో వచ్చిన మార్పు సముద్ర మట్టం 0.24 అంగుళాల మేర పెరిగినంతకు సమానమని 'పాపులర్ మెకానిక్స్' స్పష్టం చేసింది. భూభ్రమణ అక్షంలో చాలా మార్పు వచ్చిందని, భూగర్భ జలాలను అడ్డగోలుగా తోడేయడమే ఇందుకు కారణమని తమ పరిశోధనలో తేలిందని ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన సియోల్ నేషనల్ యూనివర్సిటీ శాస్త్రవేత్త కి-వియాన్ సియో ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గుర్రం దిగి బైక్ ఎక్కి.. దొంగను చేజ్ చేసి పట్టుకున్న వరుడు!

మీరట్: సాధారణంగా ఇలాంటి సన్నివేశాలు సినిమాల్లోనే కనిపిస్తుంటాయి. కానీ, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ వాసులు లైవ్‌లోనే తిలకించారు. మెడలో నోట్ల దండతో ఓ పెళ్లి కొడుకు గుర్రంపై ఊరేగింపుగా పెళ్లి మండపానికి వెళ్తుండగా అటుగా వెళ్తున్న ట్రక్ డ్రైవర్ నోట్ల దండలోని కొన్ని నోట్లు లాక్కుని పరారయ్యాడు. అప్రమత్తమైన వరుడు.. తాను పెళ్లి మండపానికి వెళ్లాలన్న విషయాన్ని పక్కనపెట్టి గుర్రం దిగి బైక్‌పై ట్రక్‌ను వెంబడించాడు. దానిని సమీపించగానే సినిమాలో చూపించినట్టుగానే బైక్‌ను వదిలి వేగంగా వెళ్తున్న ట్రక్‌ను పట్టుకుని అతికష్టం మీద ముందుకు కదులుతూ విండో గుండా లోపలికి ప్రవేశించాడు. దీంతో డ్రైవర్ వాహనాన్ని ఆపాడు. అతడు దొంగిలించిన నోట్లను తిరిగి సొంతం చేసుకున్నాడు. ఈలోగా డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నించగా ఓ బైకర్ తన బైక్‌ను అడ్డుగా పెట్టి పట్టుకున్నాడు. అనంతరం అతడికి దేహశుద్ధి చేశారు. పిడిగుద్దులు కురిపించారు. ఆ తర్వాత వారికి మరికొందరు జత కలిశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతున్నది.

పక్షుల్లోనూ విడాకులు!

ప్రతికూల వాతావరణంలో ఎక్కువగా తెగదెంపులు

సిడ్నీ: మనుషుల్లానే అనేక పక్షులు సైతం చాలాకాలం ఒకే సహచరితో జీవిస్తాయని, కొన్ని సందర్భాల్లో మనుషుల్లానే విడిపోతాయని అంటున్నారు ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకులు. మాక్వారీ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు సీషెల్స్ ద్వీపాల్లో కనిపించే సీషెల్స్ వార్‌బ్లెర్ అనే పక్షులపై అధ్యయనం జరిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ పక్షులు ఎక్కువగా విడిపోతున్నట్టు వీరు గుర్తించారు. ఈ పక్షులు 15 ఏండ్ల పాటు కలిసి ఉంటాయని, యేటా 1 నుంచి 16 శాతం వరకు తమ బంధాన్ని తెంచుకుంటున్నాయని పరిశోధకులు తెలిపారు. సంతానోత్పత్తి సమయంలో వర్షాలు ఎక్కువగా ఉన్నప్పుడు లేదా ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు ఈ పక్షులు ఎక్కువగా విడిపోతున్నట్టు గుర్తించామని చెప్పారు. కాబట్టి, వాతావరణ మార్పుల ప్రభావం పక్షుల సంతానోత్పత్తిపైనా పడుతున్నదని తెలిపారు.

సీఎన్‌జీ ధరల పెంపు

కిలోకు రూ.2 వడ్డన

న్యూఢిల్లీ: సీఎన్‌జీ యూజర్లకు షాక్! దేశవ్యాప్తంగా ఢిల్లీ మినహా మిగిలిన నగరాల్లో సీఎన్‌జీ ధర పెరిగింది. కిలో సీఎన్‌జీకి రూ.2 చొప్పున పెంచారు. ఢిల్లీ శాసన సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ నగరానికి ఈ పెంపుదల నుంచి మినహాయించినట్లు కనిపిస్తున్నది. ఇన్‌పుట్ కాస్ట్ 20 శాతం పెరిగినప్పటికీ ఎంజీఎల్, అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ వంటి సిటీ గ్యాస్ రిటెయిలర